వాడికి పది సంవత్సరాలుంటాయి. పాలుగారే వాడి పసిబుగ్గలు ఆవేదనతో ఎరుపెక్కాయి. ధారగా కారుతున్న కన్నీళ్ళు వాడి ఒంటికి పట్టిన చెమటతో కలిసిపోయి చొక్కా తడిసి ముద్దయ్యింది.

మండువేసవి. పైగా మిట్టమధ్యాహ్నం. పొగలుగ్రక్కే నల్లటి తారు రోడ్డుపై వాడు చెప్పులు లేకుండానే నడుస్తున్నాడు. కాళ్ళు బొబ్బలెక్కేలా కాలిపోతున్నా... శరీరం స్పర్శ కోల్పోయిన వాడిలానే నడుస్తున్నాడు. నీళ్ళల్లో నాని పోయి ఒరిసిన వాడి చేతులు ఆ వేడిని భరించలేకపోతున్నాయి. అయినా మండుటెండలో మొండిగానే నడుస్తున్నాడు.

మనస్సుకు తగిలిన గాయంకంటే ఈ శారీరక గాయం పెద్దగా నొప్పనిపించడం లేదు వాడికి.

సరిగ్గా పదిరోజుల క్రితం కాఫీ హోటల్లో పనికి కుదిరాడు వాడు. నెలవారిగా వచ్చే జీతం మూడొందలు తక్కువేగానీ, డైలీ టిప్పుల రూపంలో వచ్చే డబ్బులు ఇరవై రూపాయలకి పైమాటే. ఆ వచ్చిన డబ్బులతో అమ్మకి మందులు కొనుక్కెళ్ళేవాడు.

ఇంతవరకూ కని, పెంచి, పోషించిన అమ్మకి హఠాత్తుగా జబ్బు చేసింది. తనని ఆప్యాయంగా భుజాన వేసుకొని లాలిస్తూ, చందమామను చూపిస్తూ, గోరుముద్దలు తినిపించిన అమ్మకి జబ్బుచేసి మంచాన పడ్డది.

అమ్మని బ్రతికించుకోవాలనే ఆశతో వాడు కాఫీ హోటల్లో పనికి కుదిరాడు. ఈ పదిరోజులుగా వచ్చే టిప్పుల డబ్బులతో క్రమం తప్పకుండా మందులు కొనుక్కెళ్ళాడు. కాని ఈరోజు ఆ ఉద్యోగం పోయింది.

గంట క్రితం కాఫీ హోటల్లో జరిగిన సంఘటన వాడి కళ్లముందు కదలాడింది.

హోటల్ జనంతో కిక్కిరిసి వుంది. వాడు, తినేసిన ప్లేట్లని గోళెం దగ్గర కడుగుతూ ఉంటే హఠాత్తుగా ఎవరో వాడి జబ్బపట్టుకొని హోటల్ యజమాని వద్దకు ఈడ్చుకుపోయారు. ఊహించని సంఘటనకు వాడి గుండె ఆగినట్టయ్యింది. భయంతో శరీరం సన్నగా ఒణికింది. ఈ దృశ్యాన్ని చూడగానే యజమాని గుండెల్లో బాంబు పేలినట్టయ్యింది. సీట్లోనుండి కంగారుగా లేచి వాళ్ళకి సవినయంగా నమస్కరించాడు.

"చూడు మిస్టర్. పద్నాలుగు సంవత్సరాల వయస్సులోపు పిల్లల్ని పనిలో పెట్టుకోవడం నేరమని నీకు తెలియదా?" అన్నాడు తెల్లగా పొడుగ్గా ఉన్న మొదటి వ్యక్తి.

"ఇదివరకే నీకు చెప్పి చూసాను. అయినా అదే తప్పు మళ్ళీ చేస్తున్నావ్" అంటూ గద్దించాడు లావుగా ఉన్న రెండో వ్యక్తి.

"తప్పైపోయింది సార్. ఈ క్షణం నుంచి వాణ్ణి పనిలో నుండి తీసేస్తున్నాను. ఇక వాణ్ణి పనిలో పెట్టుకోను"అంటూ బ్రతిమలాడుకొన్నాడు హోటల్ యజమాని.


ఆ వ్యక్తుల వాగ్ధాటి హోటల్ యజమానిపై కొన్ని నిమిషాలపాటు ప్రవాహంలా కొనసాగుతూనే వుంది. కొన్ని నిమిషాల తర్వాత వాళ్ళ మధ్య ఏదో ఒప్పందం కుదిరింది. వాళ్ళు విసురుగా బయటకు వెళ్ళిపోయారు.

"ఒరేయ్ చంటి... ఈరోజు నుండి నువ్వు పనిలోకి రానవసరం లేదు. అర్ధమయ్యిందా..." కసురుకొంటూ వాళ్ళపై కోపాన్ని చంటిగాడిపై చూపించాడు హోటల్ యజమాని.

"అయ్యా... అమ్మకి మందులు కొనుక్కెళ్ళాలి. ఇరవై రూపాయలు యిప్పించండి"అంటూ బ్రతిమలాడుకొన్నాడు చంటిగాడు.

"నువ్వు పనిలోకి చేరిన రోజునే, మీ అమ్మ అడ్వాన్సుగా రెండొందలు పట్టుకెళ్ళింది. ఇంకా నువ్వే నాకు బాకీ పడ్డావ్! ఆ బాకీ నువ్వేమీ తీర్చనవసరం లేదు గానీ, రేపటినుండి పనిలోకి రాకు. వెళ్ళిపో..." అని చెప్పి లోపలకి వెళ్ళిపోయాడు హోటల్ యజమాని.

ఎడతెరిపి లేకుండా జారుతున్న కన్నీళ్ళని తుడుచుకుంటూ నిస్సహాయంగా ఇంటి ముఖం పట్టాడు చంటిగాడు. ఇంటికెళ్ళగానే అమ్మ అడిగే మొదటి ప్రశ్న "ఏరానాన్న! మందులు తెచ్చావా?" అని. అమ్మకి ఏం సమాధానం చెప్పాలి.



# నిశ్శబ్ద గీతం

- గంటా కళ్యాణీనాయుడు

**ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

అమ్మని పరీక్ష చేసిన డాక్టరుగారి మాటలు చంటిగాడికి గుర్తుకొచ్చాయి.

"ఒరేయ్ చంటి. మీ అమ్మకొచ్చిన జబ్బుని టి.బి. అంటారు. ఇప్పటికే బాగా ఆలస్యం కావడంవల్ల జబ్బు బాగా ముదిరిపోయింది. బలమైన ఆహారం తింటూ, నేను రాసిచ్చిన మందులు క్రమం తప్పకుండా ఆరు నెలలు కోర్సుగా వాడితే జబ్బు నయమౌతాది. నీకు ముఖ్యంగా చెప్పేదేమిటంటే, ఏ ఒక్కరోజు మందు వేసుకోవడం మానేసినా, అంతవరకూ వాడిన మందులన్నీ నిష్ప్రయోజనమౌతాయి. అందుచేత గ్యాప్ రాకుండా మందులు వాడాలి."

డాక్టరుగారి మాటలు గుర్తుకొచ్చేసరికి వాడి బుర్ర మొద్దుబారిపోయింది.

'ఏరోజుకారోజు మందులు వేసుకోకపోతే అమ్మ చచ్చిపోతుంది? రెండు రకాల మందులకి ఇరవై రూపాయలు కావాలి! ఇప్పుడేలా?' ఆలోచనలో వాడి బుర్ర వేడెక్కిపోయింది. అనేక ప్రశ్నలు ఆ పసి హృదయంలో తూటాల్లా దిగబడుతున్నాయి. వాడి మనస్సు నిశ్శబ్దంగా రోదిస్తూనే వుంది.

ఆలోచించగా ఆలోచించగా వాళ్ళ నాన్న వీరన్న గుర్తుకొచ్చాడు. వీరన్న పచ్చి తాగుబోతు. ఎప్పుడూ తాగుతూ ఆ రంగస్వామిగారి బ్రాందీ కొట్టుకాడ దొర్లుతూ, తాగిన మత్తులో అందరితోనూ గొడవపడ్తు వుంటాడు.

అమ్మ తాగడానికి డబ్బులివ్వలేదని గొడవ పడి మూడు నెల్ల క్రితమే ఇల్లు వదిలి వచ్చేసాడు. అప్పటి నుండి ఇప్పటివరకూ ఇంటి గుమ్మం తొక్కనేలేదు.

మూడు నెల్ల క్రితం అమ్మ సీతాలు, నాన్న వీరన్నకి మధ్య జరిగిన గొడవ గుర్తుకొచ్చింది చంటిగాడికి.

★ ★ ★

"సీతాలు... సీతాలు..." అంటూ కేకేసిన వీరన్న మాటలు వినబడి పొయ్యి దగ్గరనుండి బయటకొచ్చింది సీతాలు.

"రావే సీతాలు... వచ్చి యిలా నా పక్కనే కూకోవే..." అన్నాడు. రోజస్తమానూ తాగుతూ ఎప్పుడు యింటికొచ్చినా సీతాల్తో గొడవ పడ్తూ వుండే వీరన్న నెమ్మలంగా వుండేసరికి తుఫాను ముందు వుండే ప్రశాంతత అని అర్థంచేసుకొని "యేంటి ఈయేళ నామీద ఇంత పేమ కలిగింది. యేంటి యిశేషం?" అంది సీతాలు.

"ఇదిగో ఈ మల్లె దండ నీ కొప్పులో పెడదామని..." అంటూ జేబులో వున్న మల్లెదండ బయటకు తీస్తూ లేవబోయి కిందికి పడ్డాడు.

సీతాలు ముఖం కోపంతో ఎర్రబడ్డది. "మళ్ళీ తాగొచ్చావా? తాగితే ఈ గుమ్మంలో అడుగెట్టొద్దన్నాను కదా! ముందు బయటకు పో..." అని గద్దించింది.

"ఇదిగో సీతాలు నీమీద పేమతో మల్లెదండ తెత్తే యిసుక్కుంటావా! నా దగ్గర డబ్బుల్లేకపోతే సోముగాడి దగ్గర ఐదు రూపాయలు అప్పుచేసి మరీ పట్టుకొచ్చాను. కోపం తర్వాత గానీ ముందు ఈ దండ తీసుకొని నీ కొప్పులో ముడుసుకోవే" అంటూ దండను సీతాలుకిచ్చాడు.

ఆ మాటలకి సీతాలు శాంతించింది. ఆనందంగా దండ తీసుకొని తల్లో పెట్టుకొంది. సీతాలు వాలకాన్ని గమనించిన వీరన్న తన రెండు చేతులతో సీతాల్ని వెనుక నుండి చుట్టవేసుకొన్నాడు.

"ఏంటి ఈ సరసం? చంటోడు చూత్తున్నాడు" వీరన్న చేతుల్ని విదిలించుకొంటూ సిగ్గుగా అంది సీతాలు.

"నా పెళ్ళాం నా యిట్టం. మద్దెలో ఆడికేంటి?" అంటూ రెండు చేతుల్ని మరింత బిగించేసాడు.

కొన్ని క్షణాల తర్వాత "సీతాలు...సీతాలు..." అన్నాడు గోముగా లోగొంతులో.

"యేంటి మావ, యేంటొసెప్పు" అంది సీతాలు. 'సెపుతాను గాని నువ్వు కోపం తెచ్చుకోకుండా నేను చెప్పింది యిని నా మాట కాదనకూడదు" అన్నాడు.

ఊహించినట్టుగానే వీరన్న డబ్బులుకొచ్చాడని అర్థమయ్యింది సీతాలుకి. "చెప్పు, నేను సేయగల్గిందైతే సెత్తాను" అంది. "నాకు వంద రూపాయలు కావాలి?" అన్నాడు. "నా దగ్గర సిల్లిగవ్వ కూడా లేదు మావ?" భయపడ్తూ చిన్నగా చెప్పింది. "ఈరోజు శనివారం వారం కూలీ ఈరోజే యిత్తారు. ఆ డబ్బంతా ఏమైనట్టు" అసహనంగా గొంతు పెంచి అన్నాడు.

"కిరణాపట్టీ, బియ్యం తెచ్చిన డబ్బులు జమచేస్తే, ఇంకేమి మిగల్లేదు" సమాధానం చెప్పింది.

"నాకు డబ్బులు కావాలి? మర్యాదగా యిత్తావా! యివ్వవా?" అంతవరకూ నెమ్మళంగా ఉన్న వీరన్న ఎగిరిపడ్డాడు.

"నిజంగా నా దగ్గర డబ్బుల్లేవు?" ఖచ్చితంగా సమాధానం చెప్పింది.

"డబ్బుల్లేవా! నువ్వు యివ్వకపోతే నేనే ఎతుక్కుంటాను" కోపంగా లోపలికెళ్ళి ఇంట్లోఉన్న సామానంతా చిందరవందర చేసేశాడు. డబ్బులేమీ దొరకలేదు. విసురుగా బయటకొచ్చాడు.

"ఇదిగో సీతాలు, నువ్వు డబ్బులియ్యకపోతే చంటోణ్ణి తీసుకుపోతాను. తీసుకుపోయి కోయిటా(కువైట్) నుండి వచ్చిన సాయిబుగార్కి ఈడ్ని అమ్మేత్తాను. పదేలు యిత్తానన్నారు. ఆ పదేలుకి కావల్సినంత మందు వత్తాది? సెప్పు డబ్బులిత్తావా... ఈడ్ని అమ్మేయ్యమంటావా?" బెదిరింపుగా అన్నాడు వీరన్న.

సీతాలు భయంతో ఒణుకుతూ "చంటోడి సాచ్చిగా చెప్తున్నాను, నిజంగా నా దగ్గర డబ్బులు లేవు!" అంది.

"అయితే నీ యిట్టం" అంటూ ఆడుకొంటున్న చంటిగాణ్ణి భుజాన వేసుకొని వెళ్ళబోయాడు. సీతాలు తన శక్తినంతా కూడదీసుకొని చంటోణ్ణి తన చేతుల్లోకి లాగేసుకొంది.

ఒక్కసారిగా వీరన్న విరుచుకుపడ్డాడు. "నీయ్యమ్మ... నామీదే తిరగబడతావా?" అంటూ మోకాల్తో సీతాలు డొక్కలో బలంగా పొడిచాడు. ఆ దెబ్బకి సీతాలు కళ్ళు బైర్లుకమ్మాయి. బాధని తట్టుకోలేక విలవిలలాడుతూ అక్కడికక్కడే చంటిగాడితో సహా కూలబడిపోయింది.



"ఇదిగో సీతాలు, నువ్వు డబ్బులియ్యక పోతే చంటోణ్ణి తీసుకుపోతాను. తీసుకుపోయి కోయిటా(కువైట్) నుండి వచ్చిన సాయిబుగార్కి ఈడ్ని అమ్మేత్తాను. పదేలు యిత్తానన్నారు. ఆ పదేలుకి కావల్సినంత మందు వత్తాది? సెప్పు డబ్బులిత్తావా... ఈడ్ని అమ్మేయమంటావా?"

ఈ గొడవకి చుట్టూవున్న జనం గుమిగూడారు. సీతాలు అవస్థని గమనించిన వాళ్ళు వీరన్నని చావబాదారు. గొడవ సర్దుమణిగింది. మౌనంగావున్న వీరన్న విసురుగా పైకి లేచి "నీయ్యమ్మ నన్నే కొట్టిత్తావా? నీ అంతు చూత్తాను" అంటూ సీతాలు మీదికి రాబోయాడు. ఆ మాటలకి వీరన్నని మళ్ళీ ఆ జనమే చావబాదారు. ఈసారి గట్టిగా దెబ్బలు తగిలినయ్యి.

"ఒరేయ్ యిరన్నా... ఈరోజునుండి ఈ గుమ్మంలో అడుగెడితే నీ పేణాలు గాల్లో కలిసిపోతాయి. మర్యాదగా యిక్కడనుండి ఎళ్ళిపో" అంటూ ఆ గుంపులో వున్న ఓ పెద్దాయన హెచ్చరించాడు.

"ఒసేయ్ సీతాలు... నీ మొగుడు సచ్చిపోయాడనుకో. ఈరోజు నుండి నాకూ నీకూ ఏ సంబంధం లేదు. నేను బతికుండగా నీ మొఖం చూడను. థూ... నీయమ్మా..." తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు వీరన్న.

* * *

ఆరోజు నుండి ఈరోజువరకూ వీరన్న మళ్ళా ఇంటికి రాలేదు.

"నాన్న దగ్గరకెళ్ళి అమ్మ పరిస్థితి చెప్తే? డబ్బులివ్వడు సరికదా... నన్ను ఆ సాయిబుగారికి అమ్మేస్తే? అమ్మో ఇంకేమైనా వుందా? అప్పుడు అమ్మను ఎవరుచూస్తారు" వాడి మనస్సులో అపశృతులు గంటాపథంగా మ్రోగుతూనే వున్నాయి.

'ఏమైనా సరే అమ్మని బ్రతికించుకోవాలి? ఎలా??" ఆలోచనల మధ్య ఇంటికి చేరాడు.

అమ్మ పరిస్థితి చూడగానే వాడి మనస్సు కకావికలమైపోయింది. అమ్మ జీవచ్ఛవంలా చాపపై పడి వుంది. నోటి వెంట సన్నగా రక్తం కారుతుంది. ఆ రక్తాన్ని చూడగానే గుండెల్ని మెలిపెట్టిన బాధ కలిగింది వాడికి. నిశ్శబ్దంగా రోదిస్తూ అమ్మని సమీపించాడు. రక్తాన్ని తన చేతితో తుడిచేసి "అమ్మా... అమ్మా..." అంటూ కుదిపి పలకరించాడు.

సీతాలు మెల్లగా కళ్ళు తెరిచింది. "ఏరా నాన్న అప్పుడే వచ్చేశావే?" లోగొంతులో ప్రశ్నించింది వాణ్ణి.

సమాధానం ఏం చెప్పాలో తోచలేదు వాడికి. మరుక్షణంలోనే తేరుకొని "నిన్ను చూడాలనిపించి వచ్చానమ్మా!" అన్నాడు.

వాడి మాటలకి సీతాలు కళ్ళు వర్షించాయి. ఆప్యాయంగా వాడి తల నిమిరి భారంగా తన హృదయానికి హత్తుకొంది.

"అమ్మా నేను వెళ్తాను. సాయంత్రం వచ్చేటప్పుడు మందులు పట్టుకొస్తాను. అంతవరకూ పడుకునే వుండు" అన్నాడు.

"అలాగే నాన్న. త్వరగా వచ్చెయ్యి. నీకోసం ఎదురు చూస్తూంటాను" అంది. అమ్మని ఇంకొక్కసారి తనివి తీరా చూసి బయటకొచ్చాడు. వీధిలో దండెం మీద ఉన్న తువ్వాల్ని (టవల్) తన భుజంమీద వేసుకొని బయటకు నడిచాడు.

* * *

ఆ దేవాలయం భక్తుల సమూహంతో కిక్కిరిసివుంది. ఆ జన సమూహాన్ని కష్టంమీద దాటుకొంటూ దైవదర్శన నిమిత్తం గుడిలోకి వెళ్ళాడు చంటిగాడు.

వాడి అంతరంగాల్లో సుడులు తిరుగుతున్న దుఃఖాన్ని నిశ్శబ్దంగా కన్నీళ్ళ రూపంలో జారవిడుస్తూ దేవుణ్ణి ప్రార్థించి బయటకొచ్చాడు.

ఆ గుడిలోవున్న మండపంలో పురోహితులు వేద పఠనం చేస్తున్నారు. లయబద్ధంగా వినిపిస్తున్న ఆ వేద పఠనం చంటిగాడి హృదయానికి చల్లగా తాకింది. రెండు నిమిషాలపాటు కళ్ళుమూసుకొని కుర్చొని ఆ వాతావరణాన్ని ఆస్వాదించాడు. వాడి మనస్సు కాస్తంత తెరిపిన పడ్డది.

కొంతసేపు కూర్చొని గుడి బయటకు వచ్చాడు. గుడి మెట్లుకి యిరువైపులా ముష్టివాళ్ళు కూర్చొని యాచిస్తున్నారు. వాళ్ళకి ఎదురుగా పరచివున్న వస్త్రాలపై చిల్లర డబ్బులు, బియ్యం కనిపించాయి. వచ్చిపోయే భక్తులు తమకు తోచిన దానం చేస్తున్నారు.

ముష్టివాళ్ళందరిని దాటుకుంటూ వెళ్ళి, వాళ్ళకి చివారున కూర్చొని భుజం మీద వున్న తువ్వాల్ని తనకి ఎదురుగా పరుచుకున్నాడు.

అమ్మని బ్రతికించుకోవాలనే సంకల్పం ఆ పసిహృదయంలో బలంగా నాటుకుపోయింది. వాడి కళ్ళల్లో ఆశ. సాయంత్రానికల్లా ఇరవై రూపాయలు పోగుపడాలనే ఆశ.

"దేవుడా... అమ్మకి మందులు కొనుక్కెళ్ళాలి. సాయంత్రానికల్లా ఇరవై రూపాయలు పోగుపడేలా చూసే బాధ్యత నీదే..." అని మనస్సులోనే దేవుడ్ని తలుచుకొన్నాడు.

వచ్చిపోయే భక్తులవైపు ఆశగా చూస్తున్నాడు... వాళ్ళు దానం చేసే భిక్షంకోసం... ★